క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బడంగ్‌పేట్: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికులు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి అన్నారు. కార్పొరేషన్ పరిధి ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతిమా ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఫెడరేషన్, ఫినైట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, జీఎంకే ఫౌండేషన్, ప్రతిమా ఆస్పత్రి, మదర్ గుడ్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికుల కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో ఫినైట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సీఎండీ నవీన్‌కుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మణికంఠ, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శరణ్యారెడ్డి, మదర్‌గుడ్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఫ్యాబ్‌సిటీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుక్కుగూడ: ఫ్యాబ్‌సిటీ 33కేవీ సబ్‌స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆదివారం తుక్కుగూడ పురపాలిక పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని మహేశ్వరం ఏఈ చక్రపాణి తెలిపారు. ఫ్యాబ్‌సిటీలోని పరిశ్రమలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, పరిశ్రమల నిర్వాహకులు సహకరించాలన్నారు.

తోపుడు బండ్ల పంపిణీ



తోపుడు బండ్లను పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ పవన్‌కుమార్ యాదవ్

పహాడీషరీఫ్: పేదలకు ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ అన్నారు. రంగ నాయకుల కాలనీకి చెందిన ఆరుగురు పేద చిరు వ్యాపారులకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో ఉచితంగా తోపుడు బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. రంగ నాయకుల కాలనీలో పేద ప్రజలే అధిక సంఖ్యలో నివాసం ఉంటున్నారన్నారు. చిరు వ్యాపారం చేసుకునే వారికి తోపుడు బండ్లు ఇప్పించాలని ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగానే, వారు స్పందించం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాధిపతి శుభ్రతారాయి, ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ సాయిశ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

సీఐ వెంకటేశ్వర్లు



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ తదితరులు

మహేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కోళ్లపడకల్ గ్రామంలో కేపీఎల్–9 (కోళ్లపడకల్ ప్రీమియర్ క్రికెట్ లీగ్) పోటీలను ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు. పోటీల నిర్వహణకు ముందుకొచ్చిన స్పాన్సర్ రాజేశ్‌గౌడ్‌ను సీఐ, గ్రామ ప్రజా ప్రతినిధులు సన్మానించారు. అంతకుముందు టాస్ వేసి కేపీఎల్–9 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. ఎస్‌ఐ ప్రసాద్, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ, ఎంపీటీసీ మాజీ సభ్యులు హన్మగళ్ల చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు నర్సింహగౌడ్, నందిగామ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు ఆవుల మల్లేశ్, కుమార్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

షాబాద్: మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామానికి చెందిన గుటాల మల్లేశ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియలకు గాను రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ జయమ్మ, బీఆర్ఎస్ నాయకుడు సుదర్శన్ ఉన్నారు.

అకాల వర్షం.. పంటలు నష్టం



తుక్కుగూడ: రావిర్యాలలో నేలవాలిన వరిపంట



కందుకూరు: లేమూరులో దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న ఏఈఓ నర్మద

- నేలకొరిగిన వరి, రాలిన మామిడికాయలు
- ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

తుక్కుగూడ: అకాల వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. ఆరుగాలం కష్టపడి వేలాది రూపాయలు అప్పు చేసి సాగు చేసిన వరిపంటలు చేతికందే దశలో నేలరాలిపోయాయి. ఫలితంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, వడగండ్ల వర్షంతో వరి పూర్తిగా నేలకొరిగింది. సుమారు 100 ఎకరాల పైగా వరిపంట దెబ్బతిన్నట్లు సమాచారం. మామిడి, కూరగాయాల పంటలు దెబ్బతిన్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ పంటలను సర్వే చేసి నష్టపరిహారం వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దెబ్బతిన్న పంటలు

కందుకూరు: మండల పరిధిలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, వడగళ్లతో వర్షం కురిసింది. దీంతో లేమూరు, అగర్‌మియాగూడ, సరస్వతిగూడ, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరి పైరు నేలకొరిగింది. మామిడి కాయలు నేలరాలాయి. బొప్పాయి చెట్లు దెబ్బతిన్నాయి. అధికంగా వరి పంట సుమారుగా 200 ఎకరాల విస్తీర్ణంలో దెబ్బతిన్నట్లుగా వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కాగా లేమూరులో ఏఈఓ నర్మద దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఆమె వెంట స్థానిక నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, డి.శ్రీధర్, విఠల్‌రెడ్డి, రవి కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

ఉరుములు, మెరుపులతో..

మండల పరిధిలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షానికి పంటలు దెబ్బతినగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు ఎంత మేర దెబ్బతింటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడకు చెందిన మల్లేపల్లి పూజశ్రీ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, ఆమె కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే సబితారెడ్డి పరామర్శించి, ధైర్యంగా ఉండాలని కోరారు. ఆమె వెంట మాజీ సర్పంచ్‌లు డి.జంగయ్య, టి.దేవేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, నాయకులు పి.పాండు, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఆర్.రాంరెడ్డి, పి.ఆనంద్, టి.కార్తీక్, బి.దీక్షిత్‌రెడ్డి, చంద్రశేఖర్, బి.నర్సింహ, కె.నర్సింహ, రాఘవేందర్, శ్రీను, రాఘవేందర్‌గౌడ్, తుకారాం, ముఖీం పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్



ఏపీఎంకు సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు, వీఓఏలు

కందుకూరు: కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ విమర్శించారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను పురస్కరించుకొని ఐకేపీ వీఓఏలతో కలిసి శనివారం మండల కేంద్రంలో ఏపీఎం కవితకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి, కార్పొరేట్లకు కొమ్ముకాసేలా ప్రభుత్వం మారిందని ఆరోపించారు. హక్కులను పరిరక్షించుకునేలా కార్మికులు అంతా కలిసికట్టుగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఓఏలు శారద, రమ్య, పద్మ, రేణుక, లావణ్య, సువర్ణ, రాంచంద్రారెడ్డి, సీఐటీయూ నాయకులు శేఖర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కేఎల్లార్

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



రోడ్డుపై నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. మున్సిపాలిటీలోని 18వ వార్డు శ్రీరామకాలనీలో రోడ్డుపై మురుగునీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు కలుగుతున్న ఇబ్బందులపై ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో శనివారం ఆయన స్థానిక మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణతో కలిసి సమస్యను పరిశీలించి, గల్పర్ మిషన్‌తో శుభ్రం చేయించారు. గుంతను పూడ్చాలని సిబ్బందికి సూచించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని బస్తీలలో సిబ్బంది అందుబాటులో ఉంటూ డ్రైనేజీ, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆయన వెంట పారిశుద్ధ్య సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణకు ప్రత్యేక నిధులు

- రూ.30లక్షలు కేటాయించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

మీర్‌పేట: 'ఆరు దాటితే అంధకారమే' అనే శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రహదారులు, కాలనీల్లోని వీధి దీపాల నిర్వహణకు రూ.30 లక్షల నిధులను ప్రత్యేకంగా కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇట్టి నిధులతో వీధి దీపాలకు మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు చేయడం, ఎప్పటికప్పుడూ నిర్వహణ చేపడతామన్నారు. కార్పొరేషన్‌లోని మూడు చెరువుల వద్ద వెలగని లైట్లను గుర్తించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. చెరువుల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపట్టాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఓటర్ జాబితాపై సమావేశం



నాయకులు, బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ జాబితాలోని తప్పొప్పులు సవరించడం, చేర్పులు, మార్పులు తదితర అంశాలపై బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. కాగా ఈ సందర్భంగా ఆధార్ లింక్ చేయడం ద్వారా డూప్లికేట్ ఓట్లను గుర్తించాలని, చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించాలని, ఎన్నికల్లో నిర్భంద ఓటు హక్కును అమలు చేయడంతో పాటు ధన ప్రవాహాన్ని అడ్డుకునేలా చర్యలు చేపట్టాలని రాజకీయ పార్టీల నాయకులు సూచనలు చేశారు. వారు చేసిన సూచనలను ముఖ్య ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీఓ వారికి చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, బీఎల్‌ఓలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మన్సాన్‌పల్లి చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మహేశ్వరం: జనగణనతో పాటు కులగణనకు ఆమోదం తెలిపిన ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు టి.యాదిశ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని జనగణనతో పాటు కులగణన చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. అంతకుముందు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు దేశ్యానాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుండె కుమార్, జిల్లా యువ మోర్చా కోశాధికారి బొర్ర సాయిలు, నాయకులు మాధవ్, అఖిల్, కర్ణాకర్, శేఖర్, రాజవర్ధన్, రూప్‌సింగ్, దర్శన్, కృష్ణ, మహేశ్, వెంకటేశ్, సురేష్ పలువురు పాల్గొన్నారు.